ముమ్మరంగా పొగాకు కోతలు

- మెట్ట ప్రాంతంలో కూలీల కొరత
- ఈ ఏడాది 2,900 ఎకరాల్లో నాటు పొగాకు సాగు
- వాతావరణం అనుకూలిస్తే లాభం ఉంటుందన్న రైతులు


తోచలకరాయుడుపాలెంలో నాటు పొగాకు కోత కోస్తున్న దృశ్యం


కోసిన నాటు పొగాకును పందిరికి వేలాడదీసిన దృశ్యం

లింగపాలెం: మెట్ట ప్రాంతమైన లింగపాలెం మండలం జిల్లాలోనే నాటు పొగాకు సాగుకు ప్రసిద్ధి చెందింది. మండలంలో ఈ ఏడాది 2,900 ఎకరాల్లో నాటు పొగాకు పంటను రైతులు సాగు చేశారు. నాటు పొగాకు కోతలు ప్రారంభం కావడంతో కూలీల డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో కూలీల కొరత ఏర్పడింది. గతేడాది కంటే ఈ సంవత్సరం 45 ఎకరాల్లో అదనంగా ఈ పంటను ఇక్కడ రైతులు సాగు చేశారు. పొగాకు పంటను తోటలో సాగు చేసిన దగ్గర నుంచి కోత కోసే వరకు కంటికి రెప్పలా రైతులు చూసుకోవాల్సి ఉంది.

కష్టనష్టాలకు ఓర్చి పొగాకు సాగు

ఈ పంటను పండించటం చాలా కష్టతరంగా ఉంటుంది. అయినప్పటికీ రైతులు కష్ట నష్టాలకు ఓర్చి పొగాకును పండిస్తున్నారు. ఈ పంటను కోయటం అందరికీ చేతరాదు. కొంతమంది మాత్రమే అనుభవం ఉన్న వారు ఈ పని చేస్తారు. దూర ప్రాంతం నుంచి అనుభవజ్ఞులైన కూలీలను తీసుకొస్తున్నారు. కోత కోసేందుకు కూలీలకు రూ.750 చొప్పున చెల్లిస్తున్నారు. కోసిన పొగాకును పురికొసతో కట్టి పందిళ్లకు కట్టి ఎండబెడతారు. ఇది కొద్దిరోజులు తరువాత మండి వేస్తారు. అనంతరం పొగాకును విక్రయిస్తారు. కోతలు ముమ్మరంగా సాగితే కూలీల కొరత ఎక్కువగా ఏర్పడుతుంది. కూలి రేటు కూడా పెరుగుతుంది.

లింగపాలెం మండలం పరిధిలోని నేలలు అనుకూలం

ఈ ప్రాంతంలో నేలలు అనువుగా ఉండటంతో నాటు పొగాకు పంటను ఇక్కడ రైతులు సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.90 వేల వరకు పెట్టుబడి అవుతుంది. 4 నుంచి 5 పుట్లు పొగాకు దిగుబడి వస్తుంది. గతేడాది పుట్టి పొగాకు రూ.27 వేల నుంచి రూ.28 వేల వరకు విక్రయించినట్టు రైతులు తెలిపారు. ఈ ఏడాది మార్కెట్ గతేడాది కంటే ఎక్కువగా అనుకూలంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ పొగాకును వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేసుకుని గుంటూరు మార్కెట్‌కు తీసుకెళతారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే, ధర కలిసివస్తే పెట్టిన పెట్టుబడులు పోను కష్టానికి తగిన ఫలితం ఉంటుందని రైతులు అంటున్నారు.

కూలీల కొరతతో కోతలు ఆలస్యం



నాటుపొగాకు కోతలు కోసేందుకు కూలీలు కొరత ఉంది. రోజు కూలి రూ.750 చెల్లిస్తున్నాం. ఈ కోతలు కోయటం అందరికీ రాదు. కూలీల కొరతతో కోతలు ఆలస్యమవుతున్నాయి. దీంతో పైరుకు నష్టం జరిగే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది మార్కెట్ అనుకూలంగా ఉంటుందని ఆశిస్తున్నాం. ఖర్చులు ఎక్కువగా పెరిగాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఫలితం ఉంటుంది.

– రెడ్డిన శ్రీను, నాటు పొగాకు రైతు, రంగాపురం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం జంగారెడ్డిగూడెంకు చెందిన మజ్జి దుర్గారావు ఈ నెల 14న మోటార్‌సైకిల్‌పై ఇంటికి వెళుతున్నప్పుడు ఎదురుగా వస్తున్న మరో మోటార్‌సైక్లిస్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయం కావడంతో దుర్గారావును మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు విజయవాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 19న మృతి చెందాడన్నారు. మృతుడి కుమారుడు మజ్జి రామదుర్గాసందీప్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నష్టపోతున్నాం.. న్యాయం చేయండి


రెడ్డిగణపవరంలో తమ ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

బుట్టాయగూడెం: నేషనల్ హైవే రహదారి 365 బీబీ విస్తరణలో భాగంగా తమ భూములు రోడ్డు వెడల్పులో పోతున్నాయని భూములకు సంబంధించి పరిహారం రాసిన అధికారులు వాటిలో ఉండే షెడ్లు, చెట్లకు పరిహారంపై నోరుమెదపలేదని దీనివల్ల తాము నష్టపోతున్నామంటూ మండలంలోని రెడ్డిగణపవరానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము నష్టపోతున్నామంటూ సోమవారం రెడ్డిగణపవరానికి చెందిన రైతు యాండ్ర శ్రీనివాసరావు మాట్లాడుతూ 71 సర్వే నంబర్‌లోని భూముల్లో షెడ్లు, పందిరి ఉందని వీటిని రెండేళ్ల క్రితమే నిర్మించుకున్నామని దీనికి సంబంధించిన ఆధారాలున్నాయన్నారు. ఇటీవల పరిహారం వివరాల నమోదు సమయంలో అధికారులు వాటిని పరిగణంలోకి తీసుకోలేదని వాపోయారు. రైతు తూనం ప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో తనకున్న ఎకరం 10 సెంట్ల భూమి పోతోందని అన్నారు. భూమికి పరిహారం ఇస్తామని, షెడ్డు, బోరుకు పరిహారం రాయలేదని ఆయన ఆరోపించారు. రైతులు యాదాల నాగేశ్వరరావు, యాండ్ర రత్తయ్య, యాండ్ర నాగేశ్వరరావు తమ భూముల్లోని షెడ్లుకు పరిహారం ఇవ్వాలని కోరారు. గ్రామ శివారులో మల్బరీ షెడ్డుకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా పరిహారం రాశారని దీనిపై ప్రశ్నించినందున తమకు మాత్రం పరిహారం రాయకుండా ఇబ్బంది పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చెయ్యాలని వారు కోరారు. దీనిపై తహసీల్దార్ పీవీ చలపతిరావును వివరణ కోరగా మరొకసారి రికార్డులను పరిశీలించి, అర్హులందరికీ న్యాయం చేస్తామని చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు


జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న డీఎస్పీ యు.రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: అసాంఘి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ యు.రవిచంద్ర హెచ్చరించారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విందు, వినోదాల పేరుతో విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ అసాంఘిక చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకోమన్నారు. చట్టప్రకారం శిక్షించేందుకు వెనుకాడబోమన్నారు. శనివారం అర్ధరాత్రి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో సీఐ కృష్ణబాబు, లక్కవరం ఎస్సై శశాంక్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారన్నారు. మద్యం సేవించి, యువతులతో నృత్యాలు చేయిస్తూ అసభ్యకరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతోనే దాడి చేశామన్నారు. సీఐ, ఎస్సైలు ఘటనా స్థలానికి చేరుకునే సరికి యువతులు అక్కడి నుంచి వెళ్లిపోయారని ఆయన అన్నారు. అయితే ఆ ప్రాంతంలో అనధికారికంగా నృత్య కార్యక్రమం ఏర్పాటు చేయడం, తెలంగాణ మద్యం కలిగి ఉండటంతో ఆరుగురిని అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించామన్నారు. అక్కడ ఉన్న వాహనాలను సీజ్ చేశామన్నారు. లక్కవరంలో రేవ్ పార్టీ అంటూ సోషల్ మీడియాలో రావడాన్ని డీఎస్పీ ఖండించారు.

పోలవరం ప్రాజెక్టును సందర్శించిన ఎస్టీ కమిషన్ చైర్మన్


ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టును ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు, కమిటీ సభ్యులు సోమవారం సందర్శించారు. ఈయనకు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ప్రాజెక్టు పనులను శంకర్రావు పరిశీలించారు. టూరిజం అభివృద్ధికి, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సహాయ పడాలని చైర్మన్‌కు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పర్యాటకం అభివృద్ధి చెందితే ఇక్కడి ప్రజలకు జీవనోపాధి కలుగుతుందని తెలిపారు. అనంతరం పోచమ్మగండి నుంచి టూరిజం బోట్‌లో పేరంటపల్లి సందర్శనకు వెళ్లారు. ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంట పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, తహసీల్దార్ ఆర్.ఎస్.రాజు, జనసేన మండలాధ్యక్షుడు గుణపర్తి చిన్ని తదితరులు ఉన్నారు.

వైద్యుల పోస్టులను భర్తీ చేయాలి


చింతలపూడిలో వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ సంతకాల సేకరణ

చింతలపూడి: ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను తక్షణం భర్తీ చేయాలని సీపీఐ నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పట్టణంలో సోమవారం సంతకాల సేకరణ చేపట్టారు. చింతలపూడి పట్టణంలో ఉన్న ఏరియా ఆసుపత్రి స్థాయిని గతంలో 50 పడకలకు పెంచి 23 మంది వైద్యుల పోస్టులను మంజూరు చేయగా ఇక్కడ ప్రస్తుతం 12 మంది మాత్రమే పనిచేస్తున్నారని సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య తెలిపారు. ఖాళీగా ఉన్న 11 పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ సీపీఐ నగర కమిటీ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఈ ఆసుపత్రికి చింతలపూడి నియోజకవర్గంలోని గ్రామాల నుంచే కాక తెలంగాణ రాష్ట్ర సరిహద్దు గ్రామాల నుంచి, పక్కనే ఉన్న కృష్ణా జిల్లా నుంచి కూడా రోగులు వస్తుంటారని చెప్పారు. ఆసుపత్రిలో డాక్టర్ల కొరత కారణంగా రోగులను ఏలూరు తరలిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు, నగర కమిటీ సభ్యులు ఎస్.కె కాలేషా, తాడిగడప మాణిక్యాలరావు, మార్త, అమ్ములు, శ్రీరాముల రామకృష్ణ ,మానేపల్లి రామారావు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి


ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: హెల్మెట్ ధారణ ప్రతి ఒక్కరూ తప్పనిసరి అలవాటుగా చేసుకోవాలని జంగారెడ్డిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్, జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ తేజస్వి అన్నారు. జంగారెడ్డిగూడెం న్యాయస్థానాల ప్రాంగణంలో హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి హెల్మెట్‌ను ధరించి వాహనాన్ని నడపాలని సూచించారు. ఎక్కువ రోడ్డు ప్రమాదాల్లో తలకు బలమైన గాయాలు కావడం వల్లే వాహనచోదకులు మృత్యువాత పడుతున్నారన్నారు. ఈ ప్రమాదాల నుంచి సురక్షితంగా ఉండాలంటే ప్రతి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. రాష్ట్ర మరియు జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు సోమవారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) సీహెచ్ కిషోర్ కుమార్, జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కెఎస్ఆర్ తేజస్విని అందజేశారు.

మద్యం మత్తులోనే ప్రమాదాలు ఎక్కువ


కొయ్యలగూడెంలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్


కొయ్యలగూడెం: మద్యం సేవించి వాహనాల నడపడం వల్లనే ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని జంగారెడ్డిగూడెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్ రంగనాయకులు పేర్కొన్నారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్, క్లీనర్ సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదని, కారులో సీట్ బెల్ట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. వాహనదారుడు తమ వాహనాలను రహదారి కూడళ్లలో జాగ్రత్తగా నడపాలని, సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు. అసిస్టెంట్ ఎంవీఐ వై.సురేష్ బాబు, ఏఎస్ఐ ఎం.సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ చలం ఈ కార్యక్రమంలో సిబ్బంది, వాహనాల డ్రైవర్లు, పాల్గొన్నారు.

భీమరాజు సేవలు ఎనలేనివి


భీమరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: దొరమామిడికి చెందిన రెండో వార్డు మెంబర్, వైఎస్సార్‌సీపీ కార్యకర్త టి.భీమరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సోమవారం భీమరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం భీమరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ భీమరాజు వైఎస్సార్‌సీపీ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. ఆయన మరణం పార్టీకి తీరనిలోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. సర్పంచ్ తెల్లం రాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతలపూడి వెంకట నారాయణ, సోయం వెంకటరామయ్య, ఉమా దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు


కొయ్యలగూడెంలో ఉచిత పశు వైద్య శిబిరంలో రైతులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ఉచిత పశు వైద్య శిబిరాన్ని అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. పరింపూడి పశువైద్యశాల వైద్యులు బీఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో అల్ట్రా సౌండ్ ప్రగ్నాస్కోప్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఆవులు, గేదెలు, దూడలకు సంబంధించి నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి చికిత్స చేశారు. గొర్రెలకు, మేకలకు వాక్సిన్ వేశారు. రోగ నిర్ధారణ కోసం రక్తం, పేడ నమూనాలు సేకరించారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, పరింపూడి రైతు సేవా కేంద్రంలోని పశుసంవర్ధక సహాయకులు, కార్యాలయ సహాయ కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొని సేవలందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పోలవరం రూరల్: పొలవరం మండలంలో ఖాళీగా ఉన్న 7 రేషన్ షాపులకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ల నియామకానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఆర్ఎస్ రాజు తెలిపారు. ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 22వ తేదీ సాయంత్రం లోగా వారి ధ్రువీకరపత్రాలతో కలిసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కార్మికుల హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలు

టి.నరసాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు కాలరాస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. మండల కేంద్రమైన టి.నరసాపురం పాత పెట్రోల్ బంక్ ఎదురుగా సోమవారం సీపీఎం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజా సంఘాల కార్యాలయాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మండలంలో సీఐటీయూ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం ఐద్వా, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, బాలల సంఘాలకు అనుబంధంగా కార్యాలయం పనిచేస్తుందన్నారు. ఏపీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్ దురుసు ప్రవర్తనపై రైతుల ఆందోళన

కామవరపుకోట: బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు సరైన సమాధానం చెప్పకుండా అవహేళనగా, అవమానకరంగా, దుర్భాషలాడుతున్న తడికలపూడి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని సోమవారం బ్యాంకు ఎదుట రైతులు, ఖాతాదారులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఇటీవల కొత్తగా బదిలీపై వచ్చిన బ్యాంక్ మేనేజర్ దురుసుగా సమాధానం చెప్పడంతో పాటు బ్యాంకు నుంచి బయటకు పోండి అని మాట్లాడుతూ తమతో అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని రైతులు వాపోయారు. పని వేళల్లో బ్యాంకు మేనేజర్ ఖాతాదారులకు అందుబాటు ఉండటం లేదని తెలిపారు. మేనేజర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈడుపుగంటి కిషోర్, హనుమంతరావు, వెద్రు శ్రీను, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.11 లక్షల విరాళం


దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు సోమవారం రూ.1,11,000 విరాళంగా అందజేశారు. పెరవలి మండలం ఉసగట్ట గ్రామానికి చెందిన ప్రగళ్లపాటి శివరామ కృష్ణారావు ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


లింగపాలెంలో పశువులకు, గొర్రెలకు టీకాలు వేస్తున్న ఏడీఏ లింగయ్య

లింగపాలెం: గ్రామాల్లో నిర్వహించే పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.లింగయ్య అన్నారు. సోమవారం లింగపాలెం మండలం మల్లేశ్వరంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెలాఖరు వరకు పశువైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాడి రైతులు ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మహేష్, సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్ సూర్య, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్వారకాతిరుమల: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ కేఎం అంబేడ్కర్ సోమవారం తెలిపారు. ద్వారకాతిరుమల, కొమ్ముగూడెం, లక్ష్మీపురం, దొరసానిపాడు, గుండుగొలనుకుంట కాలనీ, రాళ్లకుంట, సత్తెన్నగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

పశువులకు నట్టల నివారణ మందు

ద్వారకాతిరుమల: దొరసానిపాడు, సాయన్నపాలెంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. మండల పశు వైద్యాధికారి అంగర సురేష్, జి.కొత్తపల్లి పశు వైద్యాధికారి రమేష్ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. గేదెలు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు అందించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, ఏహెచ్ఏలు, గోపాల మిత్రలు, పాడి రైతులు పాల్గొన్నారు.

కుక్కునూరు పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలి

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంతంలోని కుక్కునూరు పీహెచ్‌సీని ఏరియా ఆసుపత్రి లేదా సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసి గైనకాలజిస్టును నియమించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ అనుబంధ ప్రగతిశీల మహిళా సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ బృందం కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా పీవోడబ్ల్యూ అధ్యక్ష, కార్యదర్శులు సోడె విజయ, ఎస్‌కే మున్నీ మాట్లాడుతూ కుక్కునూరు ఆసుపత్రికి ఎక్కువ సంఖ్యలో రోగులు వస్తుంటారని, అత్యవసర కేసులు వచ్చినప్పుడు ఆసుపత్రిలో ఉన్న 10 పడకలు ఎలా సరిపోతాయని అన్నారు. స్త్రీలు ప్రసవ సమయంలో భద్రాచలం, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోందన్నారు.ఏజెన్సీ ప్రాంతంలో గైనకాలజిస్టును నియమించాలని కోరారు. కుక్కునూరు మండల పరిధిలోని రెండు పీహెచ్‌సీలకు ఒకే ఒక 108 వాహనం ఉండటంతో జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం నుంచి అవసరమైతే మరో 108 వాహనాన్ని తెప్పించాల్సిన పరిస్థితి నెలకొంటోందని, రెండు పీహెచ్‌సీలకు 108 వాహనాలను కేటాయించాలని కోరారు. పీవోడబ్ల్యూ జిల్లా సభ్యులు కె.రత్తమ్మ, ఎం.రంగమ్మ పాల్గొన్నారు.

సర్వేకు సహకరించండి

దెందులూరు: ప్రభుత్వ భూములు, జిరాయితీ భూముల గుర్తింపు, సరిహద్దుల నిర్ధారణ సర్వే కార్యక్రమానికి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మలకచర్లలో లక్ష్యాలు నెరవేరేలా అధికారులు కృషి చేయాలని, ప్రజలు వారికి సహకరించాలని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. సోమవారం మలకచర్ల రెవెన్యూ ఉద్యోగులు, రైతులు, ప్రజాప్రతినిధులతో కలిసి అన్ని కూడళ్లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఐదుగురి బైండోవర్

పోలవరం రూరల్: పోలవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఐదు బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాటుసారా కేసుల్లో ముద్దాయిలైన ఐదుగురిని పోలవరం తహసీల్దార్ ఆర్ఎస్ రాజు ముందు హాజరు పర్చినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కామవరపుకోట: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెన్నారావు సోమవారం తెలిపారు. ఎస్సై చెన్నారావు తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన గొల్లా శ్రీను (30) సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఇతనికి వివాహం కాలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరి తడికలపూడి వచ్చి మరలా తిరిగి వెళుతుండగా స్థానిక సినిమా హాలు సమీపంలో ఏలూరు నుంచి ఎదురుగా వస్తున్న వ్యాన్ శ్రీను నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి శ్రీనును తీసుకెళుతుండగా మార్గమధ్యలో మరణించినట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చింతలపూడి మండలం ప్రగడవరంలో నాటు సారా స్థావరాలపై అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన కొనకళ్ల జయమ్మ అనే మహిళ నుంచి 2 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. లింగపాలెం మండలంలోని వేములపల్లికి చెందిన నత్తా రాములమ్మ వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఇరువురి మహిళలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. చింతలపూడి మండలం ప్రగడవరంలో నాటు సారాయి కేసులో నిందితురాలు అయిన కొనకళ్ల జయమ్మ, తొమ్మండ్రు సురేష్, కొమ్ము సతీష్ , సీకాకోళ్ల రమేష్‌ను మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చి బైండోవర్ నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై ఆర్‌వీఎల్ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సారా తయారీదారులపై కఠిన చర్యలు

బుట్టాయగూడెం: ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో నాటు సారా తయారీ విక్రయాలు ఇటీవల కాలంలో మళ్లీ పెరిగిపోయాయి. కొండల్లో చెరువుగట్టు ప్రదేశాల్లో జోరుగా నాటుసారా తయారు చేస్తున్నారు. సమాచారం అందుకుంటున్న ఎక్సైజ్ అధికారులు ముమ్మరంగా దాడులు చేస్తూ తయారీకి ఉపయోగించే బెల్లపు ఊటను ధ్వంసం చెయ్యడంతోపాటు కేసులు నమోదు చేస్తున్నారు. కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. జనవరి నెల నుంచి ఇప్పటి వరకూ పోలవరం, బుట్టాయగూడెం మండలాల్లో 18 కేసులు నమోదు చేసినట్లు పోలవరం ఎక్సైజ్ సీఐ వీరబ్రహ్మం తెలిపారు. 116 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. 5,200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. 46 అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

వీధి కుక్కల దాడిలో ముగ్గురు బాలలకు గాయాలు

ద్వారకాతిరుమల: తిరుమలంపాలెంలో ఇద్దరు బాలురపై వీధి కుక్క సోమవారం దాడి చేసింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ కె.రుషి, ఎం.ఆనంద్‌పాల్‌ను స్థానికులు హుటాహుటిన ద్వారకాతిరుమల పీహెచ్‌సీకి తరలించి వారికి ర్యాబీస్ వ్యాక్సిన్ వేయించారు. గుండుగొలనుకుంటలో ఒక బాలికపై వీధి కుక్క దాడి చేసింది.

మద్ది ఆలయం మాజీ చైర్మన్ మృతి

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయం మాజీ చైర్మన్ దల్లి చిన్న వీర్రాజు రెడ్డి (75) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై కొద్ది నిమిషాల్లోనే మృతి చెందారు. చిన్న వీర్రాజురెడ్డికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన మృతిపట్ల పలువురు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు, డెకనాల్ రాంబాబు, బీజేపీ నాయకులు ఎం.ఎస్.రామారావు, మొగళ్లపు వెంకటేశ్వరరావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పోలవరం డివిజన్
90102 23729
95055 08399 (చింతలపూడి)
Office mail : tpgadvt@gmail.com